ముందస్తు బెయిల్‌కు వైసిపి నేతలు దరఖాస్తు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసులో ఇరుక్కున్న వైసిపి నేతలపై పోలీసులు కేసు నమోదు చేయడంతో అరెస్టుల భయంతో పరారీలో ఉన్నారు. శనివారం ముందస్తు బెయిల్ కోసం కోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటా చలపతిపై మదనపల్లి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో నాన్ బెయిలబుల్ కింద ఏడు కేసులు నమోదు అయ్యాయి. ఫోర్జరీ 336(2), ప్రభుత్వ రికార్డుల ఫోర్జరి 337, ఫోర్జరి రికార్డులు ఉంచుకోవడం 339, దొంగతనం 303(2), 317(2), 317(5) సాక్ష్యాలు చెరిపి వేయడం, నిందితులకు సహకరించడం 238 సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. పదుల సంఖ్యలో అనుమానితులు, వైసిపి నాయకులు పరారీలో ఉన్నారు. పోలీసు ఎఫ్ఐఆర్‌లను సేకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు, ఫైళ్ల దగ్ధం కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రైస్‌మిల్ మాధవరెడ్డి, మరో బినామి రామకృష్ణారెడ్డి, బాబ్‌జాన్ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. నిందితులను త్వరలోనే అరెస్టు చేసేందుకు పోలీసులు పావులు కదుపుతున్నారు.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న నర్సరీలు

నాసిరకం విత్తనాలతో నష్టపోతున్న రైతులు

పట్టని సంబంధిత అధికారులు

కలికిరి చుట్టుపక్కల ప్రాంతాలలో అనధికారిక బొప్పాయి, టమోటా, కూరగాయల నర్సరీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. లాభాపేక్షే లక్ష్యంగా నర్సరీ యజమానులు నాశిరకం విత్తనాలతో నార్లు పోసి రైతులకు అంటకడుతున్నారు. రైతులు అధిక డబ్బులు వెచ్చించి కొన్న నార్లు నాసిరకంగా ఉండడంతో పురుగు మందులు, ఎరువులు వాడకంతో పెట్టుబడులు ఎక్కువవుతున్నాయి. తీరా పంట చేతికి వచ్చేటప్పటికి నాణ్యతలేని పంట రావడంతో గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో నర్సరీ నిర్వాహకుల ఆగడాలకు అంతే లేకుండా పోతోంది.

ప్రజాశక్తి-కలికిరి

మండలంలో గుట్టపాలెం పంచాయతీల్లోని కె.బరనేపల్లి, సి.భరినేపల్లి, గుట్టకాడబర్నేపల్లి, మేడేకుర్తి పంచాయతీలోని మజ్జిగవాండ్లపల్లి, కూకటగొల్లపల్లి, చీకటిపల్లి పంచాయతీలోని రంగనాథపురం, చీకటిపల్లి, పల్లవోలు గ్రామాలలో అత్యధికంగా బొప్పాయి, టమోటాతో పాటు కూరగాయలు పంటలను రైతులు సొంత భూములతో పాటు కౌలు భూముల్లో కూడా అధికంగా పండిస్తారు. కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ తదితర మండలాల్లో 200 ఎకరాల్లో కలికిరి మండలం నుండి కౌలు రైతులు అక్కడికి వెళ్లి బొప్పాయి పంటను పండిస్తారు. వీరికి కావలసిన బొప్పాయి నారు మదనపల్లి, కలికిరి, అనంతపురం, రైల్వేకోడూరు తదితర ప్రాంతాలలోని నర్సరీల నుండి బొప్పాయి మొక్క రూ.11 నుంచి రూ.12 చొప్పున కొనుగోలు చేసి బొప్పాయి సాగు చేస్తారు. ఒక్కొక్క ఎకరానికి 1000 నుండి 1100 మొక్కలు నాటుతారు. ఎకరానికి రూ.రెండు లక్షలకుపైగా పెట్టుబడి వస్తుంది. బొప్పాయి సాగు చేసిన వారందరూ చిన్న, సన్న కారు, కౌలు రైతులు కావడంతో ఎకరానికి రూ.35 వేల నుండి రూ.40 వేల వరకు లీజుకు, పంట పెట్టుబడి కోసం రూ.రెండు వడ్డీకి అప్పులు తీసుకొని పంటను పండిస్తారు. పంటకు అన్ని రకాల సస్యరక్షణ చర్యలు కూడా తీసుకున్నప్పటికీ సరైన దిగుబడి రాక రైతులు తీవ్రంగా దెబ్బతింటున్నారు. ఏడు నెలల తర్వాత సాధారణంగా బొప్పాయి పంట చేతికి వస్తుంది. ఐదు నుంచి ఆరు అడుగులు ఎత్తు పెరగాల్సిన బొప్పాయి మొక్క ఎనిమిది అడుగులు దాకా పెరిగి పూత పూసి పిందే వచ్చింది కానీ కాయ మాత్రం సైజు పెరగలేదు. రంగు రాలేదు. పైగా ఆ కాయ చెట్టుకు నిలబడకపోవడంతో ఒకవైపు నాణ్యత, రెండో వైపు సైజు లేకపోవడం వల్ల దిగుబడి తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎకరానికి 60 నుంచి 70 టన్నులు రావాల్సి ఉండగా సుమారు టన్ను కాయలు కూడా వచ్చే పరిస్థితి రాకపోవడంతో బొప్పాయి రైతులకి కన్నీరే మిగిలిందని, ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఎంతో నష్టం జరిగినప్పటికి ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు కనీసం పరిశీలించిన పరిస్థితి కూడా లేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి బొప్పాయి తోటలను పరిశీలించి, జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. నాశిరకం నారు వల్ల నష్టపోయిన పత్తి కౌలురైతుకు ఎకరానికి రూ.రెండు లక్షలు చొప్పున నర్సరీ యాజమాన్యం నష్ట చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో అలా జరగకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.

నాసిరకం విత్తనాలతో కాయలు లేకుండా బొప్పాయి చెట్లు

అనుమతి లేని నర్సరీలపై చర్యలు తీసుకోవాలి

రూ.లక్షల ఖర్చు పెట్టి మొట్టమొదటి సారిగా మూడు ఎకరాలు బొప్పాయి తోట సాగు చేశాను. కల్తీ విత్తనాలతో తక్కువ దిగుబడి వచ్చింది. నాసిరకం విత్తనాలతోనే దిగుబడి తగ్గింది. పెట్టుబడి కూడా రాక నష్టాలు పాలయ్యాను. ప్రభుత్వం కనికరించి నష్టపరిహారం చెల్లించాలి. లేకపోతే ఆత్మహత్యలే శరణ్యం.

- పి.గోవిందు, బొప్పాయి రైతు, కె.బరినేపల్లి.

నాసిరకం విత్తనాలతో నష్టపోయా

నాసిరకం విత్తనాలతో నష్టపోయా. పదేళ్లుగా బొప్పాయి, టమోటా పంటలు పండిస్తాను. నాసిరకం విత్తనాల వల్ల పంట దిగుబడి సక్రమంగా రాలేదు. పెట్టుబడి కూడా రాలేదు. ప్రతి ఏటా నష్టాల్లో కొనసాగితే బొప్పాయి పంటలు పండించడం మానుకోవాల్సిందే.

- యాదగిరి, రైతు, వాడవాండ్లపల్లి గుట్టపాలెం.

నాసిరకం విత్తన నార్లు అమ్మితే కఠిన చర్యలు

రైతులకు నాసిరకం విత్తనాల నార్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. కలికిరి పట్టణంలో 21 నర్సరీలు ఉన్నాయి. నర్సరీలను తనిఖీ చేస్తాం. నష్టపోయిన రైతులకు పరిహారం కట్టించేలా చర్యలు చేపడతాం. నర్సరీ యజమానులు విత్తనాలు తెచ్చిన చోట బిల్లులు తీసుకుని రైతులకు కూడా బిల్లులు ఇవ్వాలి. భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

- సుకుమార్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి, కలికిరి.

రాజకీయ వేధింపులతో

అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాజకీయ వేధింపులు భరించలేక అంగన్వాడీ కార్యకర్త జె.నాగరత్నమ్మ పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం పెద్దజంగంపల్లెలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు నాగరత్నమ్మను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తరలించి వైద్యం అందిస్తున్నారు. నాగరత్నమ్మకు గత ప్రభుత్వంలో జగనన్న ఇల్లు మంజూరైంది. నాగరత్నమ్మ భర్త వీరభద్ర వైసిపి సానుభూతి పరుడు కావడంతోపాటు ఎన్నికల్లో ప్రచారం చేశాడన్న నేపంతో వేధింపులకు గురిచేశారు. తమ ఇంటి కుల్చివేసేందుకు వచ్చారని, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతోనే ఇంటిపై దాడికి వచ్చామని ఓ ప్రముఖ దినపత్రిక విలేకరి, టిడిపి నాయకుడైన మోహన, స్థానిక నాయకులు మద్దిరాల ప్రసాద్, శివప్రసాద్, రమణయ్య, ఆంజనేయులు చెప్పారని భాధితురాలి భర్త వీరభద్ర పేర్కొన్నారు. తాము ఇంటిని నిర్మించుకుని బిల్లులు కూడ పొందామన్నారు. సుమారు మూడేళ్లకు పైగా అయిందన్నారు. ఇప్పుడు తమపై కక్ష సాధింపులు ఎందుకని ప్రశ్నించారు. టిడిపి నాయకులు వేధింపులు తాళలేకనే తన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని చెప్పారు. కాగా ఈ సంఘటనపై పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

చికిత్స పొందుతున్న నాగరత్నమ్మ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరత్నమ్మను పరామర్శిస్తున్న నాయకులు

అంగన్వాడీలపై వేధింపులు ఆపాలి

అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు, అధికారుల బెదిరింపులు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. ఆత్మహత్యాయతానికి పాల్పడిన నాగరత్నమ్మను ఆస్పత్రిలో వారు పరామర్శించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దజంగంపల్లె అంగన్వాడీ కార్యకర్త జె.నాగరత్నమ్మపై అధికారి పార్టీకి చెందిన రాజకీయ నాయకుల వేధింపులు, బెదిరింపులు తీవ్రతరం కావడంతో దిక్కుతోచక తీవ్ర మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పేర్కొన్నారు. 2011లో అంగన్వాడీ పోస్టుకు పోటీ పడిన తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ఓ ప్రముఖ దినపత్రిక విలేకరి బంధువుకు ఉద్యోగం రాలేదని, నాగరత్నమ్మ వైసిపి నేపథ్యం ఉన్నందువలన వారివలనే ఉద్యోగం రాలేదని భావించి, అది మనసులో ఉంచుకుని నేడు టిడిపి అధికారం చేపట్టిన తరువాత ఆ విలేకరి, కొంతమంది కొంతకాలంగా నాగరత్నమ్మపై ఒత్తిడి తెచ్చారన్నారని విమర్శించారు. ఉద్యోగంలో నుండి తొలగించాలని సూపర్‌వైజర్‌పై కూడా ఒత్తిడి తెచ్చారన్నారు. ఇతర అంగన్వాడీలను నాగరత్నమ్మకు మద్దతి ఇవ్వవద్దని చెబుతున్నారని తెలిపారు. నాగరత్నమ్మతో పాటు చిన్నమండెంలో జానకి అనే కార్యకర్త కుటుంబ సభ్యులు గత ఎన్నికలలో వైసిపి ఏజెంట్‌గా కూర్చున్నారనే నెపంతో ఆమెకు ఒకేసారి మూడు మెమోలు ఇచ్చి ఉద్యోగం నుండి తొలగించాలనే అభిప్రాయానికి వచ్చారని పేర్కొన్నారు. వేధింపులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోచ్చున్నారు. విచారణ పేరుతో రజని అనే వర్కర్ సర్టిపికెట్స్ తీసుకొని అవి నకిలీవని చెప్పి రకరకాలుగా అంగన్వాడీలను వేధించడం సరైనది కాదన్నారు. ఈ విషయాలు మంత్రి, కలెక్టర్, ఎస్‌పి దృష్టికి తీసుకెళతామని చెప్పారు. అంగన్వాడీలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని రాష్ట్ర రవాణా యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని ప్రజలు నీటి సమస్యతో నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీటి సమస్య పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు నీటి సమస్య ఉన్న గ్రామాలలో దాదాపు 15 బోర్లు వేసిందన్నారు. ఇలా అవసరమైన ప్రతి గ్రామంలో బోర్లు వేసి నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుడుతామని పేర్కొన్నారు. నేడు గాలివీడు మండలం, ఎగువగొట్టి వీడు గ్రామంలోని నాగన్న గుట్ట పాలెంలో బోరు వేశారన్నారు. బోరు నుంచి గ్రామానికి నీటి సరఫరా చేసి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

మంత్రి 'మండిపల్లి' ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు తమ సమస్యలు విన్నవించేందుకు వందల మంది ప్రజలు తరలివచ్చారు. జిల్లా నలు మూలల నుంచి ప్రజలు ఉదయం 9:00 గంటలకే ఇక్కడికి చేరుకుని వినతి పత్రాలతో బారులు తీరారు. ఉదయం 9:00 నుంచి సాయంత్రం వరకు ప్రజల కష్టాలు వింటూ మంత్రి మండిపల్లి వినతులు స్వీకరించారు. విజయవాడ నుంచి జిల్లాకు చేరుకున్న మంత్రికి అధిక సంఖ్యలో బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పిస్తున్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సనా అయేషా

మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోండి : డాక్టర్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, తద్వారా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను నివారించవచ్చునని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ సనా అయేషా అన్నారు. శనివారం మండలంలోని గండబోయనపల్లి పంచాయతీ నాగుల బావిలో పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జబ్బులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మాత్రలు, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నీరు కలుషితం లేకుండా శుభ్రమైన నీరు తాగాలని, నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు, మురుకి నీరు ప్రవహించకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్, ముజీబ్ బాషా, రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాశయం కోసం ప్రతి విద్యార్థి పాటుపడాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతి విద్యార్థి జీవితంలో తాను అనుకున్నటువంటి లక్ష్యాన్ని చేరుకునే దిశగా పయనించినప్పుడే ఉన్నతాశయం సిద్ధిస్తుందని టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక రాజు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రఘురామరాజు ఆధ్వర్యంలో జరిగిన యాంబిషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పాల్గొని వెంకటరమణ మాట్లాడుతూ లక్ష్యసాధనలో అనేక ఆటంకాలు ఎదురైనా నిలదొక్కుకుని వాటిని అధిగమించినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని చెప్పారు. ఇందుకోసమై తల్లిదండ్రులు, గురువులు, సమాజ హిత చింతకుల ఆలోచనలు స్వీకరించాలని ఆయన సూచించారు. అనంతరం ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తేజ, సుబ్బారెడ్డి, హబీబ్, సునీత, నాగమణి, గాయత్రి తదితరులు, అన్ని తరగతుల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంగనపల్లి వెంకటరమణను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

వైభవంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం పట్టాభి రామాలయంలో శనివారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన సీతారాములకు స్నపనతిరుమంజనం గావించారు. అనంతరం నూతన వధువరులైన సీతారాములను మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో సుందరంగా ముస్తాబుచేసిన ఆలయంలోని కల్యాణవేదికపై ఆశీనులు చేశారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ కల్యాణోత్సవం కన్నుల పండుగగా సాగింది. చివరగా హోమాది కార్యక్రమాలు, పూర్ణాహుతితో వేడుకలు ముగిశాయి. కల్యాణోత్సవంలో పాలొన్న భక్తులకు పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజ, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

బిందు, తుంపర సేద్యం అమలుకు చర్యలు

ప్రజాశక్తి-రాయచోటి: ఉద్యాన శాఖ కమిషనర్, కలెక్టర్ శ్రీధర్ ఆదేశాల మేరకు జిల్లాలో వంద శాతం సూక్ష్మ నీటిపారుదల అమలు లక్ష్యంగా కరువు రహిత జిల్లాగా, ఉద్యానవన హబ్‌గా అభివృద్ధి చేయడానికి ఈ ఆర్థిక సంవత్సరానికి 36 వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్య పరికరాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సూక్ష్మ నీటిపారుదల శాఖ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాభావ, నీటి ఎద్దడి పరిస్థితులలో సాగునీరు సద్వినియోగానికి బిందు సేద్యం ఒకటే రైతులకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గమన్నారు. టమోటా, కూరగాయ పంటలు, అరటి, పూలు లాంటి పంటలు జిల్లాలో విస్తారంగా సాగుచేస్తారని చెప్పారు. సూక్ష్మ నీటిపారుదల పరికరాలు అవసరమున్న రైతులు రైతు సేవా కేంద్రాలలో అధికారులను సంప్రదించాలన్నారు. బయోమెట్రిక్ విధానంలో రైతులు ఎంచుకున్న కంపెనీకి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రైతు సేవా కేంద్రం, సూక్ష్మ నీటి పారుదల క్షేత్రస్థాయి సిబ్బందిని, వారి పరిధిలో నీటి వసతి కలిగిన రైతులను గుర్తించి నమోదు కార్యక్రమం ప్రారంభించాలని ఆదేశించారు.

దారుణం

ప్రజాదృష్టి

ఇటీవల తెలుగుగంగ ప్రాజెక్టులో భాగమైన ఎస్ఆర్-1 రిజర్వాయర్‌లో పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన కలిచి వేసింది. ప్రతి ఏటా ఈత సరదా కోసం వెళ్తూ లెక్కించదగ్గ సంఖ్యలో యువకులు మృత్యువాత పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి ప్రమాద ఘటనల నివారణకు నీటిపారుదల శాఖ, పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలి. ఉమ్మడి కడప జిల్లాలోని 1200 చెరువులు, 16 రిజర్వాయర్లు, ఆరు నదీ పరీవాహక ప్రాంతాలు, పదుల సంఖ్యలో వాగులు, వంకలు, మడుగులు ఉన్న ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులను, ఫెన్సింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ఇటువంటి ప్రమాదకర చెరువులు, రిజర్వాయర్లు, మడుగుల ప్రాంతాల్లో నిఘా ఉంచడం వంటి చర్యల ద్వారా నివారించడానికి గల అవకాశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. జాగ్రత్తలు తీసుకోని పక్షంలో తెలుగుగంగ రిజర్వాయర్‌లో ఈత సరదా కోసం వెళ్లిన ముగ్గురు యువకులు మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది. తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిని చెరువులు సహా పుష్పగిరి, హత్యరాల వంటి పుణ్యక్షేత్రాల సమీక్షంలోని వాగు, కూరుకుని పోయే బురద ప్రదేశాలను గుర్తించి ప్రమాద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలి. రాబోయే వర్షా కాలంలో వాగులు, వంకలు, చెరువులు, మడుగుల జలకళను సంతరించుకునే అవకాశాలు పుష్కలం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జలవనరులశాఖ యంత్రాంగం గట్టిచర్యలు తీసుకోవాలి. ఇప్పటి వరకు అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తుఫానుల సమయాల్లో వరదలు పోటెత్తిన సమయాల్లో మాత్రమే పోలీసులు వంకలు, వరదల ప్రాంతాల్లో నిఘా ఉంచడం మినహా మిగిలిన సమయాల్లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల తరహాలో జలప్రమాదాల నివారణను సైతం సీరియస్‌గా తీసుకోవాలి. లేనిపక్షంలో చేతికి అందిన యువకులను చేతులారా కోల్పోవాల్సి రావడాన్ని విధికి వదిలేసి, నిమ్మకుండి పోవడం సరికాదని గ్రహించాలి. కనీస ప్రయత్నాలను చేయడాన్ని వదిలేసి, ఏటా చేతికి అందిన యువకులను గంగపాల్జేయడం క్షంతవ్యం కాదు. సదరు బాధిత కుటుంబంలోని యువకుల మృతి ఘటన వృద్ధులు, తల్లిదండ్రులు పీల్చే తుదిశ్వాస వరకు బాధిస్తూనే ఉంటుందని గ్రహించాలి. ఇటువంటి దురవస్థల బారిన పడిన తల్లిదండ్రుల గర్భశోకాన్ని రూపుమాపడానికి జిల్లా అధికార యంత్రాంగం మానవ ప్రయత్నం చేయాలి. భద్రాచలం రామాలయ సమీపంలోని గోదావరి నదిలో ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడం, ఫెన్సింగ్ వంటి నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసిన తరహాలో రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

విద్యార్థుల హక్కులను గౌరవిద్దాం

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

విద్యార్థుల హక్కులను గౌరవిస్తూ, వారికి భద్రమైన, సురక్షితమైన బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత సమాజం మీద ముఖ్యముగా పాఠశాల యాజమాన్యాలపై ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఉద్బోధించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో శనివారం నేషనల్ కమీషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి ఎంపిక చేయబడిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులకు నిర్వహించిన ఈ వర్క్ షాప్‌నకు జెసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో బాలల భద్రతకు సంబంధించిన పలు అంశాల గురించి వివరించారు. మౌలిక సదుపాయల మొదలుకుని, పాఠశాలలో విద్యార్థులకు కల్పించాల్సిన పరిశుభ్ర పరిస్థితులు, సైకో సోషియల్ అంశాలు, వీటి కల్పనలో ఉపాధ్యాయుల బాధ్యత గురించి చర్చించారు. పిసిపిసిఆర్ ప్రతినిధి డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ సేఫ్టీ మీద అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరు ఉపాధ్యాయులపై ఉందన్నారు. డిఇఒ శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలను మానసికంగా, శారీరకంగా హింసించరాదని పేర్కొన్నారు. బాలల హక్కులను గౌరవిస్తూ, ప్రతి పాఠశాలలో బాలలకు అవసరమైన అన్ని సురక్షిత మార్గాలు అవలంభించాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కరుణాకర్, డైట్ లెక్చరర్లు అజయ్ కుమార్, శ్రీదేవి, అసదుల్లా, సెక్టోరల్ అధికారులు రాధ, సమీవుల్లా, జనార్దన్, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి ఆదర్శ్ రాజేంద్రన్



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

నూలివీడులో పొలంబడి

ప్రజాశక్తి-గాలివీడు

మండలం లోని నూలివీడు గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.మండలం వ్యవసాయ అధికారి మురళీధర్ మాట్లాడుతూ రైతులు పండించే పంటలు వరి, వేరుశనగపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవాకేంద్రం వ్యవసాయాధికారులు, ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు. పొలంబడి ప్రాముఖ్యత వేరుశనగ పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు జాగ్రత్తలు గురించి తెలిపారు.

సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రంలోని వ్యవసాయ కేంద్రానికి రైతుల పశువుల కోసం గడ్డి గింజలు వచ్చినట్లు ఎడి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం75శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు సరఫరా చేస్తుందని వాటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సుండుపల్లి మండలానికి 800కిలోలు, వీరబల్లి మండలానికి 800 కిలోలు మంజూరయ్యాయని జోవర్ సిఎస్‌హెచ్‌ఎం ఎఫ్ రకానికి చెందిన గడ్డి గింజలు ఐదు కిలోల బ్యాగు రూ.115లు ధర ఉంటుందని అన్నారు. అవసం`మైన రైతులు తమ ఆధార్ కార్డు తీసుకొని పశు వైద్య కార్యాలయం వద్దకు రావాలని ఆయన తెలిపారు.

నేడు వెలిగల్లు కుడికాలువకు నీటి విడుదల

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని వెలుగల్లు కుడికాలువకు ఆదివారం ఉదయం 10 గంటలకు రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతులు మీదుగా నీటిని విడుదల చేస్తున్నట్లు వెలిగల్లు ప్రాజెక్టు డిఇ శిరీష్ కుమార్ పేర్కొన్నారు. 0.5 టిఎంసిల నీటిని మండల పరిధిలోని 30 కిలోమీటర్ల వరకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళాలో 25 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక టిఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటిఐలో శనివారం శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ రవికుమార్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో 50 మంది విద్యార్థులు హాజరు కాగా 25 మందికి ఉద్యోగవకాశాలు లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి అలవెన్స్‌తో పాటు నెలకు రూ.25 వేలు జీతం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ముగ్గురిపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఒకే కుటుంబంలో ముగ్గురిపై తేనెటీగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై బాధితులకుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దమండ్యం మండలం, శివపురం పంచాయతి, గొల్లపల్లెకు చెందిన రైతు రెడ్డప్ప (60), అతని కొడుకు వెంకటేశ్వర(45), కోడలు వెంకటరమణమ్మ (35) లు శనివారం గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బోరు వద్దకు వెళ్లారు. బోరు వద్ద వ్యవసాయ పనులు చేస్తున్న ముగ్గురిపైన ఒక్కసారిగా పెద్ద తేనెటీగలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బాధితులను కుటుంబీకులు చికిత్స కోసం మదనపల్లి సర్వజన బోధన ఆస్పత్రికి తరలించారు.

వాడివేడిగా రాజంపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపించిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం వాడి వేడిగా జరిగింది. సమావేశం ప్రారంభం నుంచి కౌన్సిలర్లు పలు సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు ప్రశ్నల వర్షం కురిపించారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు అసలు సమావేశాలు ఎందుకని ఘాటుగా విమర్శించారు. ముఖ్యంగా క్రిమిటోరియంకు ఎందుకు మరమ్మతులు చేపట్టలేదని, కాలువల్లో పూడిక సక్రమంగా తీయడం లేదని, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని, పట్టణంలో ఆరు ఆర్వో వాటర్ ప్లాంట్ లు ఉంటే అవి సక్రమంగా పనిచేయడం లేదని, పాత ఫాగింగ్ యంత్రాలు ఏమయ్యాయని, మున్సిపాలిటీకి గతంలో మంజూరైన రూ.100 కోట్లు ఏమయ్యాయని, ఎక్కడ ఖర్చు చేశారని, మున్సిపల్ కార్మికులకు జీతాలు ఎందుకు ఇవ్వలేదని కమిషనర్ ను నిలదీశారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి కలుగజేసుకొని సమస్యల పరిష్కారానికి ఏం చేయాలో సలహాలు ఇవ్వవలసిందిగా కోరారు. అందరం కలిసి మునిసిపాలిటీ అభివృద్ధికి పాటుపడుదాం అంటూ తనదైన శైలిలో సమాధానం చెబుతూ కౌన్సిలర్లు అడిగిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు మున్సిపాలిటీ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, రమణారెడ్డి, సూరి, కూండ్ల వెంకట రమణారెడ్డి, పసుపులేటి సుధాకర్, రాఘవేంద్ర వర్మ, రాము యాదవ్, మిర్యాల చెంగమ్మ, మున్సిపల్ డిఇ విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ ఎఇ మల్లేశం,సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెనుముప్పు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్లాస్టిక్ పర్యావరణానికి పెనుముప్పు ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తం తెలియజేశారు. శనివారం హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ వ్యర్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది కళాశాల ఆవరణలోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తొలగించారు. ఈ సందరేగా కళాశాల ప్రిన్సిపల్ పురుషోత్తం మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వలన భూమిపై కాలుష్యం పెరిగిపోతోందని, ప్లాస్టిక్ వినియోగం జీవులకు ప్రాణాంతకంగా మారిందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం నివారించి భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు హెల్పింగ్ హాండ్స్ స్వఛరేద సంస్థ సభ్యులు శివాజీ, మణి, నవీన్, రాఘవ, మురారి, హరికృష్ణరెడ్డి, సుబ్బారావు, నికేతన్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దిగ్విజయం చేద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పంద్రాగష్టును పురస్కరించుకొని వారం రోజులుపాటు నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను దిగ్విజయం చేద్దామని ఉత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాల నిర్వహణకు ఒక కమిటీ ఏర్పాటు చేశారు. కన్వీనరుగా కె.రఘునాథ్ రెడ్డి, కో-కన్వీనర్లుగా రాటకొండ ప్రసాద్, ఆర్.కేశవరెడ్డి, ట్రెజరర్లుగా ఎం.కృష్ణప్ప, నిర్మల్ కుమార్‌రెడ్డి, దుర్గాప్రసాద్, ప్రోగ్రాం కో-ఆర్డినేటరుగా బండి ఆనంద్, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ ఎన్.సేతు, కామకోటి ప్రసాద్ రావు, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, సాంస్క ృతిక కార్యక్రమాలు శ్రీనివాసులు, మీడియా ఇన్‌ఛార్జిగా మోడెం శ్రీనివాసరావు, కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులుగా మహేష్, శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి, శ్రీరాములు, ఉదయ్ భాస్కర్, శ్యామలలు నియమితులయ్యారు.

ఆనంద నిలయానికి ఫ్రిజ్ వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో ధాత్రి ఫౌండేషన్, షర్డ్ స్వచ్ఛంద సంస్థల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆనంద నిలయం, వృద్ధుల ఆశ్రమానికి జీవదాత సేవా ట్రస్ట్ ఫౌండర్, మంజుల పవర్ ఛానల్ యూట్యూబర్ మంజుల, తిప్పన్న శనివారం ఫ్రిజ్‌ను వితరణగా అందజేశారు. ధాత్రి ఫౌండేషన్‌లోని ఆనంద నిలయానికి విచ్చేసిన మంజులమ్మ వృద్ధుల ఉచిత డేకేర్ సెంటర్‌ను సందర్శిం చారు. వ ృద్ధుల బాగోగులు తెలుసుకొని, వారికి పండ్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ స్వాతి చక్రపాణి, సిర్డ్స్ సెక్రటరీ మరపురి హేమశేఖర్, చక్రపాణి, మంజులమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

పిండ మార్పిడి విధానంలో దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి రైల్వేకోడూరు

పిండ మార్పిడి విధానంలో రైల్వే కోడూరు దేశానికి ఆదర్శమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం రైల్వే కోడూరు మండలం, శెట్టిగుంట పంచాయతీలో పశువైద్య శాలను రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సందర్శించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఎబిఐపి ఎస్-ఎస్ ఎస్ ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ వీర్యం ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన పిండం మార్పిడి విధానం ద్వారా దేశంలోనే ప్రథమంగా పుంగనూరు దూడ మొదటగా మన రాష్ట్రంలోనే జన్మించిందని అన్నారు. శెట్టిగుంటలో లేగ దూడల ప్రదర్శనను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాముఖ్యతను ఇస్తుందని వారు తెలియ జేశారు. కార్యక్ర మంలో ఎపిఎల్‌డిఎ, సిఇఒ డాక్టర్ శ్రీనివాసరావు, అన్నమయ్య జిల్లా డిఎహెచ్ఒ డాక్టర్ గుణ శేఖర్, ఇఒ డిఎల్‌డిఎ తిరుపతి డాక్టర్ బాలసుబ్రమణ్యం, ఇఒ డిఎల్ డిఎ కడప డాక్టర్ రమేష్, ఎడి డిఎల్ఎడి డాక్టర్ రాజశేఖర్, డిడి రాజంపేట డాక్టర్ విజయ భాస్కరరావు, డిడి రాయచోటి డాక్టర్ మాలకొండయ్య, ఎడి కోడూరు డాక్టర్ సురేష్‌రాజు, శెట్టిగుంట పశువైద్యశాల అధికారి వై.ప్రతాప్, వెటర్నరీ డాక్టర్స్, ఎన్‌డిఎ కూటమి ముఖ్యనాయకులు, కార్యకర్తలు పశువైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లేగదూడను పరిశీలిస్తున్న రూపానందరెడ్డి

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం : సిడిపిఒ

రైల్వేకోడూరు : తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిడిపిఒ సౌభాగ్యమ్మ

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యమని ఐసిడిఎస్ సిడిపిఒ టిపి సౌభాగ్యమ్మ పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం పట్టణంలోని ఇమాం సాహెబ్‌వీధిలో అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్‌వైజర్ కె.యశోద ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను గురించి బిడ్డకు ముర్రుపాలను పట్టించడం వలన తల్లి బిడ్డకు కలిగే ప్రయోజనాల గురించి క్షుణ్ణంగా వివరించారు. అనంతరం సిడిపిఒ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.లీలాజ్యోతి, మునిరత్న, శిరీష పాల్గొన్నారు. **రాయచోటి** : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కారములు సూపర్వైజర్‌లు సుగుణమ్మ, నాగ మణి అన్నారు. రాయుడు కాలనీ అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భి ణులకు తల్లిపాలపె అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాపాలని సూచిం చారు. తద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి బిడ్డకు రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు తాపాలని అన్నారు. ఆరు నెలలు దాటిన తరువాత అనుబంధ ఆహారం తోపాటు తల్లిపాలు కూడా పటించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఎస్.మషరూన్, ఆశాకార్యకర్త ఎం.తిరుపతమ్మ పాల్గొన్నారు.**తంబళ్లపల్లి** : తల్లిపాలే బిడ్డకు అమృతంలా పనిచేస్తుందని ఐసిడిఎస్ సిడిపిఒ నాగవేణి తెలిపారు. తంబళ్లపల్లె 1,2 అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల ప్రాముఖ్యత గురించి సిడిపిఒ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రాధమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు ఉమరాణి, సరస్వతమ్మ, కళావతి, ఆరోగ్య సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు. **రామాపురం**:తల్లిపాలు బిడ్డ వ్యాధినిరోశక్తి పెరుగుదలకు దోహదపడతాయని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ సిడిపిఒ వై.పద్మావతి అన్నారు. మండలంలోని గువ్వల చెరువు సెక్టార్ పరిధిలోని కసిరెడ్డి గారి పల్లి పంచాయతీ సుగాలిబిడికిలో శనివారం అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాలు వారోత్సవాన్ని నిర్వహించారు. **బి.కొత్తకోట** : తల్లిపాలు చంటి బిడ్డలకు ఎంతో శ్రేయస్కరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.గౌరీదేవి పేర్కొన్నారు. బి.కొత్తకోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని, కాండ్లమడుగు క్రాస్ సెక్టార్, తుమ్మనగుట్ట అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జి.గౌరీదేవి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఎస్.హసీనా,ఆశా కార్యకర్తలు నరసమ్మ, మధు కల్పన,అంగన్వాడీ కార్యకర్త టి.అమరావతి పాల్గొన్నారు. **కలికిరి**: వాల్మీకిపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు కలికిరి సెక్టార్ లోని ఇందిరమ్మ కాలనీ ప్రాథమికోనత పాఠశాల లో అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సిడిపిఒ భారతి, సూపర్వైజర్ ఆర్.అరుంధతి, ఎస్ రెడ్డి సతాజ్, ఆధ్వర్యంలో ప్రపంచ తల్లుల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ భారతి మాట్లాడుతూ తల్లి ముర్రుపాలు ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలే ముద్దు డబ్బా పాలు వద్దని అన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నర్సులు, అంగన్వాడీ కార్యకర్తలు ఆశా వర్కర్లు ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు. **నందలూరు:** నాగిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ అరవపల్లి అంగన్వాడీ కేంద్రంలోనిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారాయుడు మాట్లాడుతూ తల్లి పాలు తాగితే ఆరోగ్యంగా తెలివిగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి మల్లేశ్వరి, పిహెచ్‌ఎన్ శైలజ, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా లలిత పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- కమిషనర్ పి.ఆర్.మనోహర్

నగర పంచాయతీకి చేరిన క్లీనింగ్ వాహనాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. పట్టణంలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. నగర పంచాయతీకి క్లీనింగ్ వాహనాలను తెప్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బి.కొత్తకోట నగర పంచాయతీకి సుందరీకరణకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలు ఎక్కువగా చెత్తవేసే స్థలాలను గుర్తించి అక్కడ నుంచి క్లీనింగ్ వెహికల్స్ ద్వారా శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి :లక్కిరెడ్డిపల్లి మండలం బ్రాహ్మణ ఎర్రగుడి గ్రామపంచాయతీ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి నాగమణి తెలిపారు. బ్రాహ్మణ, ఎర్రగుడి గ్రామపంచాయతీలోని తొమ్మిది గ్రామాలలో జెసిబితో కంపచెట్లు, ముళ్ల పొదలు తొలగించామని తెలిపారు. తొమ్మిది గ్రామ పంచాయతీలలో బ్లీచింగ్ పౌడర్ చల్లి నీటి కుంటలు లేకుండా చేశామని, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం కలిగించామని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి చుట్టుపక్కల నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. కార ్యక్రమంలో ఇఒపిఆర్‌డి పట్నాయక్, సర్పంచ్ చెంచర్లపల్లి రెడ్డయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగమణి పాల్గొన్నారు.

ముళ్ల కంపలను తొలగిస్తున్న జెసిబి

రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలి : ఎస్ఎఫ్ఐ

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయిందని అన్నారు. ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేని పరిస్థితి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉందని, పాలిటెక్నిక్ కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, రెగ్యులర్ ఫ్యాకల్టీ నియమించాలని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల అనుబంధంగా హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చినటువంటి విద్యార్థులు హాస్టల్ వసతి కోసం రైల్వే కోడూరు నుంచి రావడం తిరిగి వెళ్ళటం జరుగుతుందని అన్నారు. కళాశాలలో రెండు బ్రాంచ్‌లు మాత్రమే ఉన్నాయని అవి కూడా తక్కువ సీట్లకే పరిమితమై ఉందని, సీట్ల సంఖ్యను పెంచాలని కోరారు. కళాశాల ఆవరణంలో పారిశుధ్య పనులను చేపట్టాలని కోరారు. మంచి వాతావరణంలో విద్యార్థులకు విద్యను అందించాలి అన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు సూరివర్ధన్, చక్రి, ప్రసాద్, శ్రీనివాసులు, సాయిరాం పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కూల్ కమిటీ ఎన్నికల సందడి

ప్రజాశక్తి-పుల్లంపేట

పాఠశాలల్లో ఎన్నికల సందడి ప్రారంభమైంది. స్కూల్ కమిటీల పేరుతో ప్రభుత్వం ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు ఓటర్ల జాబితాలను కూడా జిల్లా అధికారులు ప్రకటిం చారు. ఈనెల 8న పాఠశాలలో ఎన్నికలు జరగనున్నాయి. సెక్షన్లు మీడియంతో సంబంధం లేకుండా క్లాసు యూనిట్‌గా ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఇద్దరూ మహిళలు ముగ్గురిలో ఒకరు తప్పక ఎస్‌సి, ఎస్‌టి, విభిన్న ప్రతిభావంతులు, మరొకరు తప్పక బిసి, ఇబిసి, మైనారిటీకి చెందిన వ్యక్తి అయి ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50 శాతం ఓటర్లు హాజరును రిజిస్టర్‌లో చూపిన తర్వాతనే ఎన్నిక జరపాలి. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కూడా 50శాతం సభ్యులు హాజరు ఉండాలి. క్లాసుల వారీగా ఎన్నికైన సభ్యులందరూ స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులుగా ఉంటారు. వీరందరూ కలసి కమిటీ వైస్ చైర్మన్‌ను ఎన్నుకొంటారు. వీరిలో ఒకరు తప్పనిసరి మహిళ, వీరిద్దరిలో ఒకరు ఎస్‌సి, ఎస్‌టి, విభిన్న ప్రతిభావంతులు తప్పనిసరిగా ఉండాలి. తరగతిలో కనీసం ఆరుగురు విద్యార్థులు లేకపోతే వీరిని మరొక తరగతిలోకి విలీనం చేసి ఎన్నుకోవాలి. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎన్నికల అధికారిగా ఉంటారు. తహశీల్దార్, ఎంపిడిఒ, విఆర్ఒ, విఆర్ఎ న్నికల పరిశీలకులుగా ఉంటారు. తల్లి, తండ్రి, పిల్లల సంరక్షకుడిగా నమోదైన వారు ఓటర్లుగా ఉంటారు. వీరి జాబితాలను గురువారం ప్రకటించారు. ఈనెల 5వ తేదీలోగా జాబితాలపై అభ్యంతరాలు తెలియజేసేందుకు అవకాశం ఇచ్చారు. 8వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటలోపు సభ్యుల ఎన్నిక, తరువాత చైర్మన్, వైస్ చైర్మన్ టెన్నికా నిర్వహిస్తారు. మూడు గంటలకు కమిటీ తొలి సమావేశం జరుగుతుంది. పాఠశాల విద్యా కమిటీలో ప్రతి సభ్యునికి రెండేళ్ల పదవీకాలం ఉంటుంది.విద్యార్థి స్కూలు నుంచి వెళ్లిన వెంటనే సంబంధిత తల్లిదండ్రుల సభ్యత్వం రద్దు అవుతుంది. గత ప్రభుత్వ హయంలో తల్లిదండ్రుల కమిటీ పేరుతో నాడు నేడు పనుల పర్యవేక్షణ బాధ్యత అంతా వైసిపికి చెందిన నాయకులే తీసుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆరోపణలు కూడా వచ్చాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో ఈ ప్రభావం పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలపై కూడా పడుతుందని తెలుస్తోంది. ప్రధానంగా టిడిపి కూటమికి చెందిన వారిని చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నుకునే విధంగా అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలకు పాఠశాల కమిటీ ఎన్నికలు ఒక వేదిక కావడంతో ప్రధానంగా టిడిపి, వైసిపి ఈ ఎన్నికలపై దృష్టి సారించాయి. ఎక్కువ పాఠశాలలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగేలా వ్యూహరచన చేస్తున్నారు. ఈవారం మొత్తం హెచ్ఎంలు ఈ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మదనపల్లెలో సిఐలు బదిలీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె పట్టణంలో సిఐలు బదిలీ అయ్యారు. ఒకటో పట్టణ సిఐగా ఉన్న వల్లిబషు వారం రోజుల క్రితం మదనపల్లె ఫైళ్ళ ఘటన కేసులో పనిష్మెంట్ కింద విఆర్ కు వెళ్లడంతో ఆయన స్థానంలో విఆర్ లో అన్న ప్రసాద్ రిపోర్ట్ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రసాద్ బదిలీ కావడంతో తిరుపతి ఎస్సీఎస్టీ సెల్ వన్ లో ఉన్న చాన్ బాషాకు మదనపల్లె వన్ టౌన్ కు పోస్టింగ్ ఇచ్చారు. మదనపల్లె తాలూకా పోలీసుస్టేషన్‌లో ఉన్న సిఐ శేఖర్ బదిలీ కాగా ఆయన స్థానంలో వాల్మీకిపురం సిఐ పులిశేఖర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. మదనపల్లె రూరల్ సిఐ సద్గురుడు బదిలీ కాగా విఆర్‌లో ఉన్న రమేష్ మదనపల్లె రూరల్ సిఐగా నియమితులయ్యారు.

పండ్లు పంపిణీ చేస్తున్న తాటిగుంట్ల శ్రీధర్‌రెడ్డి

రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు మండల టిడిపి సీనియర్ నాయకులు తాటి గుంట్ల శ్రీధర్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి శనివారం బ్రెడ్‌లు, పండ్లు పంపిణీ చేశారు. బాణాసంచా పేలుస్తూ కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో తాటికుంట్ల సురేంద్ర రెడ్డి, కల్లూరి రామ్మోహన్ రెడ్డి, పద్మనాభరెడ్డి, విఆర్‌డిఎస్ సురేంద్రరెడ్డి, వెంకటేష్ నాయుడు, గుదే నాగార్జున, దుర్గం ఆంజనేయులు, సర్పంచ్ నేతి ఆంజనేయులు, తుమ్మల రమేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గాలివీడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు మండల సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపిడిఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. 11వ మండల సర్వసభ సమావేశానికి ఎంపిపి జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

నేడు చౌడేశ్వరిదేవి జయంతి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని దేవగుడిపల్లి గ్రామం కొండమూలలో వెలసిన శ్రీ చౌడేశ్వరి జయంతి ఉత్స వాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం అభిషేక కార్యక్రమం నిర్వహించిన తర్వాత పూజా కార్యక్రమం జరుగుతాయని తెలిపారు. మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపును నిర్వహించి అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరుగునని ఆలయ కమిటీ నిర్వహకులు తెలిపారు.

జాబ్ కార్డులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి: గత వైసిపి పాలనలో నాయకులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా వైఎస్ఆర్ కాలనీలోని కూలీలకు ఉపాధి హామీలో జాబ్ కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వ్యవహరించారని ఇప్పటికైనా కూలీలకు జాబ్‌కార్డులు మంజూరు చేయా లని తెలుగు యువత మండల అధ్యక్షుడు కె.పకీరయ్య, సిపిఐ(ఎంల్) న్యూడె మోక్రసీ అంకన్న ఆధ్వర్యంలో ఎంపిడిఒ వెంకటరమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీలో పనిచేస్తున్న ఎపిఒ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి కువైట్ ఇతర దేశాలలో ఉన్న వారికి జాబ్ కార్డులు తయారుచేసి ప్రతి రోజూ నేటి వరకు అటెండెన్స్ కూడా వేస్తున్నారన్నారు. మండలంలో కేంద్రంలోనే కాక ఇతరుల గ్రామాలలో కూడా అనర్హులు చాలామంది జాబ్ కార్డుల్లో చేర్చారని వారు మండిపడ్డారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులని ఉపాధి హామీలో జాబ్ కార్డుల్లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో చిన్నప్ప, నందిని ,విష్ణు, సునీత,గంగులమ్మ పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న అంకన్న

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళకు గాయాలు

-పరిస్థితి విషమం

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో మహిళ పరిస్థితి విషమంగా ఉంది. బి.కొత్తకోట-కర్ణాటక సరిహద్దులోని బోయపల్లి వద్ద శనివారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని కర్నూలు జిల్లాకు మహిళ తీవ్రంగా గాయపడింది. బాధితురాలి కథనం మేరకు.. కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు మండలం, పెద్దమరవీడుకు చెందిన రాజు, లక్ష్మీ దంపతులు బ్రతుకు తెరువు కోసం కర్ణాటకలోని గౌనిపల్లిలో స్థిరపడ్డారు. కూలి పనులకోసం బి.కొత్తకోట మండలం, బోయపల్లి వద్దకు వెళ్లారు. పనులు ముగించుకుని ఇంటికి బస్సు కోసం నిలబడి ఉండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో లక్ష్మి తీవ్రంగా గాయపడడంతో 108 లో చికిత్స కోసం మదనపల్లి సర్వజన బోధనాస్పత్రికి తరలించారు.ఆస్పతి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించినా ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి కి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని రెండేళ్ల చిన్నారి దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందింది. ఈ విషాదకర ఘటన శనివారం సాయంత్రం కోసువారిపల్లిలో జరిగింది. ఘటనకు సంబంధించి తంబళ్లపల్లె ఎస్ఐ శివకుమార్ కథనం మేరకు వివరాలు.. మండలంలోని కోసువారిపల్లెకు చెందిన చరణ్, నందిని దంపతుల కుమార్తె రూప(2) ఇంటి ముందు ఆడుకుంటుండగా, ఓ ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లి పోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధిత చిన్నారిని కుటుంబీకులు చికిత్స కోసం వెంటనే మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించే లోపే ఆ చిన్నారి మృతిచెందింది. బిడ్డ కళ్ళముందే ప్రాణాలు కోల్పోవడంతో తల్లి దండ్రులు గుండెలవిసేలా విలపించారు. ఘటనపై తంబళ్లపల్లి ఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడవిలో తప్పి పోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-నందలూరు

అడవిలో తప్పిపోయిన వ్యక్తిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పెనగలూరు మండలం, నారాయణ నెల్లూరు గ్రామానికి చెందిన తోట హరిబాబు ఈనెల 2న సౌమ్య నాథస్వామి ఆలయానికి వచ్చి తిరిగి ఇంటికి రాకపోవడంతో, హరిబాబు బంధువులు స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయడంతో తనతోపాటు రవితేజ, దిలీప్ వెళ్లి గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. నందలూరు గ్రామపంచాయతీ ఈదరపల్లె గ్రామ శివారులలో హరిబాబుకు చెందిన మోటార్ సైకిల్ కనిపించడంతో అక్కడి నుండి వెతుకుతూ వెళ్ళగా సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవిలో హరిబాబును గుర్తించి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

పోలీసులతో తప్పిపోయిన తోట నారాయణ